క్లుప్తంగా

కరాటేతో ఆత్మరక్షణ



పతకాలు సాధించిన కరాటే క్రీడాకారులు

కర్నూలు(సెంట్రల్): కరాటే శిక్షణతో ఆత్మస్థైర్యం పెంపొందుతుందని ప్రొఫెషనల్ స్టూడెంట్స్ నెట్‌వర్క్ జిల్లా కన్వీనర్ ఎం.అమర్, భవిత స్కూలు కరెస్పాండెంట్ కె.నరేంద్ర పేర్కొన్నారు. సోమవారం జొహరాపురంలోని భవిత ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో సుందరయ్య స్ఫూర్తి కేంద్రం, యూనివర్సల్ కరాటే మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కరాటే నేర్చుకుంటున్న విద్యార్థులకు బెల్టు గ్రేడింగ్ పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి మొమెంటోతో పాటు సర్టిఫికెట్లను అందజేశారు.

ఉరుసు పోస్టర్ విడుదల

కర్నూలు(అర్బన్): పెనుగొండ దర్గా హజ్రత్ బాబా ఫక్రుద్దీన్ గంధం, ఉరుసు మహోత్సవాలకు సంబంధించిన పోస్టర్లను సోమవారం స్థానిక రోజా దర్గాలో వక్ఫ్ ప్రొటెక్షన్ ఫోరం రాష్ట్ర కన్వీనర్ సయ్యద్ మహ్మద్ పీర్, దర్గా పీఠాధిపతులు మషాయిఖీన్ ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ.. ఈ నెల 13, 14వ తేదీల్లో పెనుగొండ దర్గాలో జరగనున్న 752వ ఉరుసు ఉత్సవాలకు భక్తులు పెద్దసంఖ్యలో హాజరు కావాలని కోరారు. అలాగే ఈ నెల 17వ తేదీన గద్దీ నశీన్, సదర్ సజ్జాదనశీన్ నాయబ్ ముతవల్లీ హోదాను ప్రస్తుత పెను గొండ దర్గా పీఠాధిపతి తాజ్‌బాబా సాహెబ్ కుమారుడు సయ్యద్ నజర్ హుసేనీకి అప్పగించనున్నారన్నారు. సయ్యద్ నూరుల్లా ఖాద్రి, సయ్యద్ ఫరూక్‌బాషా, సయ్యద్ రియాజ్‌ఖాద్రి తదితరులు పాల్గొన్నారు.

లాంగ్వేజ్ ల్యాబ్‌ను సద్వినియోగం చేసుకోవాలి

కర్నూలు కల్చరల్: రాయలసీమ యూనివర్సిటీ ఇంగ్లిష్ డిపార్ట్‌మెంట్‌లోని లాంగ్వేజ్ ల్యాబ్‌ను సద్వినియోగం చేసుకోవాలని వర్సిటీ ఇన్‌చార్జ్ వైస్ చాన్స్‌లర్ ఆచార్య ఎన్‌టీకే నాయక్ సూచించారు. సోమవారం వర్సిటీలో ఆధునీకరించిన లాంగ్వేజ్ ల్యాబ్‌ను వీసీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల్లో బాషా నైపుణ్యాలను పెంపొందించడానికి 25 కంప్యూటర్లతో ల్యాబ్‌ను ఆధునీకరించినట్లు చెప్పారు. అనంతరం ప్రముఖ ఆంగ్ల కవి జాన్ మిల్టన్ జయంతి ఘనంగా నిర్వహించారు. ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.నరసింహులు, ఇంగ్లిష్ డిపార్ట్‌మెంటు కో–ఆర్డినేటర్ డాక్టర్ పి.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు మెడికోలకు తీవ్రగాయాలు



గాయపడిన విశ్వభారతి మెడికల్ కాలేజీ విద్యార్థులు

కోడుమూరు రూరల్: గూడూరు మండలంలోని పెంచికలపాడు పత్తి మిల్లు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మెడికల్ విద్యార్థులకు తీవ్ర గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. పెంచికలపాడులోని విశ్వభారతి మెడికల్ కాలేజీలో విద్యను అభ్యసిస్తున్న తాడిపత్రికి చెందిన గోపికృష్ణ, వైఎస్సార్ జిల్లాకు చెందిన సాయిమణి సోమవారం రాత్రి కళాశాల హాస్టల్లో భోజనం చేసి కె.నాగలాపురం వద్ద ఉన్న రూమ్‌కు బైక్‌పై బయలుదేరారు. కాసేపటికి పెంచికలపాడు పత్తి మిల్లు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. అక్కడి ప్రజలు వారిని చికిత్స నిమిత్తం స్థానిక విశ్వభారతి మెడికల్ కళాశాలకు తరలించారు. విషయం తెలుసుకున్న కె.నాగలాపురం ఎస్‌ఐ ఆశాలత ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు.గాయపడ్డ వారి మెరుగైన చికిత్స కోసం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. విద్యార్థులు స్పృహ కోల్పోవడంతో ప్రమాద ఘటనపై పూర్తి సమాచారం తెలియరాలేదు.

12 నుంచి నైపుణ్య పోటీలు

కర్నూలు కల్చరల్: ఇంటర్నేషనల్ యూత్ కల్చరల్ ఫెస్టివల్ పురస్కరించుకుని ఈనెల 12, 13, 14 తేదీల్లో వ్యాసరచన, శాస్త్రీయ, జానపద, నృత్య పోటీలు నిర్వహించనున్నట్లు టీజీవీ ఫైన్ ఆర్ట్స్ అకాడమీ అధ్యక్షుడు కేవీ భార్గవ్‌కుమార్ తెలిపారు. పోటీలు సి.క్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో జరుగుతాయని చెప్పారు. 12వ తేదీన శాస్త్రీయ నృత్యం, 13న జానపద నృత్యం, 14న శాస్త్రీయ జానపద, సంగీత పాటల పోటీలు, వ్యాసరచన పోటీలు ఉంటాయని పేర్కొన్నారు.

బద్రీనాథ్ నగర్‌లో చోరీ

కర్నూలు కల్చరల్: కర్నూలు బద్రీనాథ్ నగర్‌లో ఉద్యోగి ఇంట్లో దొంగతనం జరిగింది. హంద్రీ నీవాలో పనిచేస్తున్న మద్దిలేటి కుటుంబ సభ్యులతో ఈనెల 7వ తేదీ హైదరాబాద్‌కు వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేరని తెలుసుకున్న దొంగలు తాళాలు పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. సోమవారం ఉదయం గమనించిన ఇరుగుపొరుగు వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. బాధితుడు ఇంటికి చేరుకున్నాక అపహరణకు గురైన సొత్తు వివరాలు తెలిసే అవకాశం ఉంది. త్రీటౌన్ పోలీస్‌లు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నెట్‌బాల్ పోటీలు ప్రారంభం

కర్నూలు (టౌన్): బి.క్యాంపు క్రీడా మైదానంలో సబ్ జూనియర్ నెట్‌బాల్ ఎంపిక పోటీలు, టోర్నమెంటు నిర్వహించారు. ప్రతిభ చాటిన క్రీడాకారులకు రిటైర్డు డీఎస్పీ మహబూబ్‌బాషా షీల్డ్‌లు బహుకరించారు. నెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షులు నాగేశ్వర రావు, కార్యదర్శి నాగరత్నమయ్య పాల్గొన్నారు.

ధర్నాలతో దద్దరిల్లిన కలెక్టరేట్

కూటమి ప్రభుత్వ ఆరు నెలల పాలనపై అన్ని వర్గాల ప్రజల్లో వ్యతిరేకత మొదలైంది. సోమవారం వివిధ సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నాలు, ఆందోళనలతో జిల్లా పరిపాలనా కార్యాలయం దద్దరిల్లింది. ఎన్నికల వేళ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కోరుతూ విద్యార్థులు మొదలుకుని కార్మికులు, ఉద్యోగులు, ప్రజాసంఘాల నాయకులు కదం తొక్కారు. కలెక్టరేట్‌ను ముట్టడించి హామీలు ఏమయ్యాయని ప్రభుత్వాన్ని నిలదీశారు. అన్ని వర్గాలను మోసగించి గద్దెనెక్కిన సీఎం చంద్రబాబుకు, కూటమి ప్రభుత్వానికి గుణపాఠం తప్పదని హెచ్చరించారు.

డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న డీవైఎఫ్‌ఐ నాయకులు, డీఎస్సీ అభ్యర్థులు

కర్నూలు(సెంట్రల్): కాలయాపన చేయకుండా డీఎస్సీ నోటిఫికేషన్‌ను వెంటనే విడుదల చేయాలని డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి వై.నగేష్ డిమాండ్ చేశారు. సోమవారం డీవైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో అభ్యర్థులు బిర్లా గేటు నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించి గాంధీ విగ్రహం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. డీఎస్సీ నోటిఫికేషన్ విడుదలకు మరో ఆరు నెలల సమయం పడుతుందని చెప్పడం అన్యాయమన్నారు. సీఎం చంద్రబాబునాయుడు ప్రమాణస్వీకారం తర్వాత చేసిన మొదటి సంతకానికే వక్రభాష్యం చెప్పడం తగదన్నారు. మరో వైపు డీఎస్సీలో జిల్లా అంతటా ఒకే పేపర్ నిర్వహించాలని, ఆన్‌లైన్ గాకుండా ఆఫ్‌లైన్‌లో పరీక్ష నిర్వహించాలని డిమాండ్ చేశారు. నాయకులు రాఘవేంద్ర, శిరీష తదితరులు పాల్గొన్నారు.

విధుల్లోకి తీసుకోవాలని ధర్నా



కలెక్టరేట ఎదుట ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

కర్నూలు(సెంట్రల్): కరోనా సమయంలో ఆర్టీసీ బస్టాండ్‌లో పనిచేస్తున్న 11 మంది కార్మికులను తొలగించారని, వారిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎండీ అంజిబాబు డిమాండ్ చేశారు. సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. కార్మికులకు ముందస్తుగా ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా తొలగించారని, దాదాపు మూడేళ్ల నుంచి విధుల్లోకి తీసుకోవాలని కోరుతున్నా పట్టించుకోవడం లేదని వాపోయారు. అనంతరం కలెక్టర్ పి.రంజిత్‌బాషాకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వినతిపత్రం ఇచ్చారు. నాయకులు సీహెచ్ సాయిబాబా, ఆర్.నరసింహులు, మహ్మద్‌రఫీ, పి.దేవరాజు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న డ్రైవర్లు

కర్నూలు(సెంట్రల్): ఎన్నికల కోసం వినియో గించిన మినీ ట్యాక్సీల పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని డ్రైవర్లు శివాజీ, రాజశేఖరరెడ్డి, శీను, శివ డిమాండ్ చేశారు. సోమవారం వారు కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు.వారు మాట్లాడుతూ ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు తమ వాహనాలను ప్రభుత్వం వినియోగించినట్లు చెప్పారు. అయితే ఎన్ని కలు ముగిసి 8 నెలలు అవుతున్నా తమకు బాడుగలు చెల్లించకుండా కాలయాపన చేస్తోందని విమర్శించారు.

ఇళ్లస్థలాలు ఇవ్వాలి



నగరపాలక సంస్థ ఎదుట ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు, కాలనీ వాసులు

కర్నూలు (టౌన్): ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం పేదలకు 2 సెంట్ల చొప్పున ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఐ నగర కార్యదర్శి రామక్రిష్ణా రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక నగరపాలక సంస్థ ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూపర్ సిక్స్ పేరుతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం పేదలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందన్నారు. పట్టణ ప్రాంతాల్లోని పేదలకు 2 సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లోని వారికి 3 సెంట్ల ఇళ్ల స్థలాలు ఇస్తామని చెప్పారని గుర్తు చేశారు. వెంటనే ఇళ్లస్థలాలు కేటాయించి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మునెప్ప నాయకులు సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ఉద్యమం



ధర్నా చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

కర్నూలు(సెంట్రల్): మునిసిపల్ ప్రజారోగ్య విభాగంలో పనిచేస్తున్న కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలను ఉధృతం చేయనున్నట్లు ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప స్పష్టం చేశారు. సోమవారం ఏఐటీయూసీ అనుబంధ మునిసిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర సమితి పిలుపు మేరకు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో కార్మికులు సమ్మెకు వెళ్లిన సందర్భంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తక్షణమే స్పందించి వేతన బకాయిలు, యూనిఫాంలు ఇవ్వాలని, సంక్షేమ పథకాలను వర్తింపజేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. టైమ్‌స్కేల్ ప్రకారం రూ.26 వేల జీతం ఇవ్వాలని డిమాండ్ చేశారు. జి.చంద్రశేఖర్, మునిసిపల్ కార్మికులు పాల్గొన్నారు.

వేతనాలు పెంచే వరకు పోరాటం



ఆందోళన చేస్తున్న ఇంజినీరింగ్ కార్మికులు

కర్నూలు (టౌన్): ప్రభుత్వానికి ఎన్ని సార్లు చెప్పినా.. తమ వేతనాలు పెంచడం లేదని, పదేళ్ల పూర్తయిన ఇంజినీరింగ్ విభాగం కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, అధ్యక్షులు మనోహర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇప్పటికే సమ్మె నోటీసు ఇచ్చిన మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు సోమవారం స్థానిక అశోక్‌నగర్‌లోని నగరపాలక సంస్థకు చెందిన హెడ్ వాటర్ వర్క్స్ వద్ద ఆందోళన చేపట్టారు. వాటర్ వర్క్స్, పార్కులలో పనిచేసే 300 మంది కార్మికులు విధులను బహిష్కరించారు. తమకు న్యాయం చేయాలని నినదిస్తూ ర్యాలీగా నగరపాలక సంస్థ కార్యాలయానికి చేరుకున్నారు. అసోసియేషన్ నాయకులు రమేష్, వెంకటేశ్వర్లు, యాసీన్ బేగ్, జ్ఞానమ్మ కార్మికులు పాల్గొన్నారు.

వైద్య సామగ్రి విరాళం



వైద్య సామగ్రిని అందిస్తున్న డాక్టర్లు శ్రీనివాసరెడ్డి, సురేష్‌కుమార్‌రెడ్డి తదితరులు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు స్థానిక జొహరాపురం రోడ్డులోని అశ్విని హాస్పిటల్ వారు సర్జికల్ గౌన్లు, టవల్స్‌ను విరాళంగా ఇచ్చారు. సోమవారం వీటిని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లుకు అశ్విని హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ సి.శ్రీనివాసరెడ్డి, సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ సురేష్‌కుమార్‌రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆసుపత్రికి రూ.2.10 లక్షలు విలువ చేసే 300 సర్జికల్ అప్రాన్స్, 300 టవల్స్ అందజేసినట్లు తెలిపారు. ఆసుపత్రిలోని ఆపరేషన్ థియేటర్లు, సర్జికల్, గైనకాలజీ తదితర విభాగాలకు ఇవి ఉపయోగకరంగా ఉంటాయన్నారు. డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సీతారామయ్య, డాక్టర్లు శ్రీరాములు, విశాల, కిరణ్‌కుమార్, తదితరులు ఉన్నారు.

వైభవంగా ఊంజల సేవ



స్వామివారికి ఊంజల సేవ నిర్వహిస్తున్న భక్తులు

కర్నూలు కల్చరల్: ఓల్డ్‌సిటీ మెయిన్ బజార్ రామాలయం శతాబ్ది బ్రహ్మోత్సవాల్లో భాగంగా సీతారాముల వారికి ఊంజల సేవను వైభవంగా నిర్వహించారు. సోమవారం ఆలయంలో వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపట్టారు. తిరుమల తిరుపతి దేవస్థానం అన్నమాచార్య ప్రాజెక్ట్ వారు నిర్వహించిన భక్తి సంగీత విభావరి అలరించింది. విష్ణు సహస్రనామ సత్సంగం, భరతమాత దేవాలయం బృందం ఆధ్వర్యంలో సామూహిక విష్ణు సహస్రనామ పారాయణం, శ్రీమద్ భగవద్గీతలోని పదవ అధ్యాయం విభూతి యోగాన్ని భక్తులు సామూహికంగా గానం చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ కోశాధికారి చిలుకూరి నంద కిశోర్ మాట్లాడుతూ.. ఆలయంలో బ్రహ్మోత్సవాలు ప్రారంభమై వంద సంవత్సరాలు అవుతున్న నేపథ్యంలో ఆలయానికి పునర్వైభవం తీసుకొచ్చేందుకు పలు కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామన్నారు. అఖిల భారత కరివేన నిత్యాన్నదాన సత్రం నిర్వాహకులు డాక్టర్ వేణుగోపాల్, ఆలయ కమిటీ సభ్యులు హనుమేశ్ ఆచార్యులు, సుధీంద్ర తదితరులు పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ మహిళా జట్టుకు సత్కారం

కర్నూలు (టౌన్): గత నెల 26 నుంచి 30వ తేదీ వరకు బెళగాని వీటీయూలో నిర్వహించిన సౌత్‌జోన్ అంతర్ యూనివర్సిటీ బ్యాడ్మింటన్ మహిళల టోర్నమెంటులో 3వ స్థానంలో నిలిచిన రాయలసీమ వర్సిటీ జట్టును ఘనంగా సత్కరించారు. సోమవారం వర్సిటీలో వీసీ ప్రొఫెసర్ ఎన్.టి.కె.నాయక్, రిజిస్ట్రార్ విజయకుమార్ నాయుడు క్రీడాకారులను శాలువాలు, జ్ఞాపికాలతో సన్మానం చేశారు. వారు మాట్లాడుతూ ఆర్‌యూ జట్టు మూడవ స్థానంలో నిలిచి ఖేలో ఇండియా పోటీలకు అర్హత సాధించడం హర్షించదగ్గ విషయమన్నారు. వర్సిటీ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ కేవీ శివకిషోర్ పాల్గొన్నారు.

ఆర్‌యూలో ఆడిట్ రగడ

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయంలో ఆడిట్ రగడ తీవ్ర గందరగోళానికి తెరతీసింది. వర్సిటీ కెమిస్ట్రీ ప్రొఫెసర్ డీఓఏ నిధులను పక్కదారి పట్టించారనే ఆరోపణలపై ఆడిట్ చేసేందుకు సోమవారం వచ్చిన అధికారులను సదరు ప్రొఫెసర్, ఆమె కుటుంబ సభ్యులు అడ్డుకున్నారు. ఆడిట్‌కు ఆటంకం కలగకుండా పోలీస్‌లు బందోబస్తుగా రావడం, సదరు ప్రొఫెసర్‌కు సపోర్ట్‌గా బయటి వ్యక్తులు రావడంతో ఉద్రిక్తత చోటు చేసుకుంది. సీజ్ చేసిన డీఓఏ ఆఫీస్ తాళాలను తెరవకుండా అడ్డుపడ్డారు. తనకు సంబంధం లేకుండా ఆఫీస్ సీజ్ చేశారని, అందులో కొన్ని ఫైల్స్‌ను కొందరు ప్రొఫెసర్లు తారుమారు చేశారని, కాల్చివేశారని ఆరోపిస్తూ ప్రొఫెసర్ ఆడిట్‌కు అభ్యంతరం చెప్పారు. ఆడిట్‌కు సంబంధించి ఈసీ మినిట్స్ ఇవ్వాలని పట్టుబట్టారు. తమకు తెలియకుండా ఎవరైనా డీఓఏ ఆఫీస్‌ను తెరిచినా ఆడిట్ చేయించినా వారిపై కేసు పెడతామని హెచ్చరించారు. దీంతో ఆడిట్ అధికారులు తమకు అందుబాటులో ఉన్న ఫైల్స్ ఇచ్చి ఎలాంటి ఇబ్బంది లేకుండా సహకరిస్తే ఆడిట్ చేస్తామని, లేని పక్షంలో ఉన్నతాధికారులకు నివేదిస్తామని వర్సిటీ రిజిస్ట్రార్‌కు చెప్పారు. రిజిస్ట్రార్ డాక్టర్ విజయకుమార్ నాయుడు మాట్లాడుతూ.. సదరు ప్రొఫెసర్‌ను సస్పెండ్ చేసిన రోజే అప్పటి అధికారులు ఆఫీస్‌ను సీజ్ చేశారన్నారు. ఫైల్స్ మాయం అయ్యాయి, కాల్చివేశారనే ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. అలాంటి అనుమానం వచ్చినప్పుడే వర్సిటీ ఉన్నతాధికారులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసి ఉండాల్సిందన్నారు. ప్రభుత్వం , ఈసీ నిర్ణయం ప్రకారం రెండు మూడు రోజుల్లో ఆడిట్ నిర్వహణకు సంబంధించి నిర్ణయం తీసుకుంటామన్నారు.

కూటమి పాలనలో పేదలకు వాతలు



మాట్లాడుతున్న కె.ప్రభాకరరెడ్డి

కర్నూలు(సెంట్రల్): కూటమి సర్కారు పేదలకు వాతలు పెడుతోందని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కె.ప్రభాకరరెడ్డి విమర్శించారు. సోమవారం పాత బస్టాండ్‌లోని బావర్చి బంకెట్ హాల్‌లో ఎస్.సోమన్న ప్రాంగణంలో సీపీఎం కర్నూలు ఓల్డ్‌సిటీ 20వ నగర మహాసభలు జరిగాయి. నాయకులు విజయ్, ఎస్ఎండీ షరీఫ్, జయమ్మ అధ్యక్షతన సీనియర్ నాయకులు కేవీ సుబ్బయ్య పతాకావిష్కరణ చేసి అమరవీరులకు నివాళులర్పించారు. అంతకుముందు సీపీఎం నాయకులు సీతారాం ఏచూరి, సోమన్న చిత్ర పటాలకు నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటుచేసిన సభలో ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలు చేస్తూ రాజ్యాంగ పరిరక్షణ.. మత సామరస్యం కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని పిలుపునిచ్చారు. ఉచిత గ్యాస్ సిలిండర్ పథకానికి అయ్యే ఖర్చు కంటే హోర్డింగ్‌ల కోసం కూటమి సర్కార్ చేస్తున్న ఖర్చు ఎక్కువగా ఉంటోందన్నారు. డీఎస్సీ పేరిట సీఎం చంద్రబాబు నిరుద్యోగ యువతను మోసగించారని విమర్శించారు. రాష్ట్రంలో గంజాయి, డ్రగ్స్ విచ్చలవిడిగా దొరకుతుండడంతో విద్యార్థులు వాటి బారిన పడిజీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పి.నిర్మల మాట్లాడుతూ.. కూటమి పాలనలో నిత్యవసర వస్తువుల ధరలు పెరగడంతో పేద, మధ్యతరగతి వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రజానాట్య మండలి కళాకారులు ఆలపించిన చైతన్య గీతాలు కార్యకర్తలను ఉత్తేజపరిచాయి. సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్, నగర కార్యదర్శి ఎం.రాజశేఖర్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కర్నూలు న్యూసిటీ: విద్యుత్ శాఖలో అభివృద్ధి పనులు చేపట్టనున్న నేపథ్యంలో నగరంలో మంగళవారం విద్యుత్ కోతలు ఉంటాయని ఈఈ శేషాద్రి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జొహరాపురం, చిత్తారిగేరి, జమ్మిచెట్టు, రాంబొట్ల ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు వెల్లడించారు.

12న గొర్రెల పెంపకందారుల యూనియన్ సమావేశం

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు జిల్లా గొర్రెల పెంపకందారుల సహకార యూనియన్ సర్వసభ్య సమావేశం ఈ నెల 12న జరుగనుందని కార్యనిర్వాహక సంచాలకులు డాక్టర్ సుబాన్‌బాష తెలిపారు. యూనియన్ అధ్యక్షుడు కే.ఏ శ్రీనివాసులు అధ్యక్షతన కొండారెడ్డి బురుజు సమీపంలోని బహుళార్థ పశువైద్యశాల ప్రాంగణంలోని సమావేశ మందిరంలో ఉదయం 10 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. యూనియన్ కార్యవర్గ సభ్యులు, జిల్లాలోని ప్రాథమిక గొర్రెల పెంపకందారుల సహకార సంఘం అధ్యక్షులు పాల్గొంటారని వెల్లడించారు.

రక్తదానంపై అవగాహన

కర్నూలు సిటీ: రెడ్ రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం సిల్వర్‌జూబ్లీ డిగ్రీ కాలేజీలో రక్తదానంపై అవగాహన సదస్సు నిర్వహించారు. క్లస్టర్ యూనివర్సిటీ వీసీ ఆచార్య డీవీఆర్ సాయిగోపాల్, రెడ్‌క్రాస్ సొసైటీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రామచంద్రారావులు హాజరై ప్రసంగించారు. ప్రతి ఒక్కరు రక్తదానం చేసేందుకు ముందుకు రావాలన్నారు. 45 కేజీల బరువు ఉండి, 18 ఏళ్లు దాటిన ప్రతిఒక్కరు రక్తదానం చేయవచ్చన్నారు. ప్రిన్సిపల్ డా.వి.వి.ఎస్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ డా.బిఆర్ ప్రసాద్ రెడ్డి, రెడ్ రిబ్బన్ క్లబ్ కో–ఆర్డినేటర్ డా.ఎల్లా క్రిష్ణ, రెడ్‌క్రాస్ సొసైటి కో–ఆర్డినేటర్ రమేష్, రూప,తదితరులు పాల్గొన్నారు.

వ్యాయామంతో ఆరోగ్యం

కర్నూలు (టౌన్): విద్యార్థులు క్రమం తప్పకుండా ప్రతి రోజూ వ్యాయామం చేయడం ద్వారా ఆరోగ్యంగా ఉంటారని రాష్ట్ర జూడో సంఘం కార్యదర్శి శ్రీధర్ అన్నారు. సోమవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో జిల్లాస్థాయి జంప్ రోప్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 14, 15 తేదీల్లో సత్యసాయి జిల్లా నిర్వహించనున్న రాష్ట్రస్థాయి జంప్ రోప్ పోటీల్లో ప్రతిభ చాటాలని పిలుపునిచ్చారు. ఒలింపిక్ సంఘం కార్యదర్శి శ్రీనివాసులు, జంప్ రోప్ సంఘం కార్యదర్శి జోసఫ్ పాల్గొన్నారు.

స్మారక స్థూపాన్ని నిర్మించండి

కర్నూలు(అర్బన్): అమరులైన వీర జవాన్ల జ్ఞాపకార్థం కర్నూలులో అమర జవాన్ల స్థూపాన్ని నిర్మించాలని మాజీ సైనికుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నగ్రా పేరయ్య కోరారు. సోమవారం ఆయన మాట్లాడుతూ నగరంలోని ఓ ప్రధాన కూడలి స్థూపం ఏర్పాటు చేయాలన్నారు.

ఆటోడ్రైవర్‌కు ఆర్థికసాయం

కర్నూలు(సెంట్రల్): నగరంలోని 23వ వార్డు శ్రీరామ్‌నగర్‌కు చెందిన ఆటో డ్రైవర్ మద్దిలేటి కొంతకాలంగా పెరాలసిస్ వ్యాధితో బాధపడుతున్నారు. ఆయన అనారోగ్యానికి గురవడంతో కుటుంబ గడవడం కష్టమైంది. ఈ విషయం తెలుసుకున్న తోటి ఆటో డ్రైవర్లు ఆర్థిక సాయం చేయాలని నిర్ణయించుకున్నారు. ఆటో యూనియన్, సీఐటీయూ యూనియన్ నాయకులు బి.రాధాకృష్ణ, వలి, జయరాజు చేతులు మీదుగా మద్దిలేటి కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు. ఆటో డ్రైవర్ మద్దిలేటి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

నేడు విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక

కర్నూలు న్యూసిటీ: విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికను మంగళవారం మంత్రాలయం సబ్ డివిజన్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు విద్యుత్‌శాఖ పర్యవేక్షక ఇంజినీర్ ఉమాపతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గూడూరు, మంత్రాలయం, ఎమ్మిగనూరు డివిజన్ల పరిధిలోని విద్యుత్ వినియోగదారులు విద్యుత్ సమస్యలపై వినతులు సమర్పించి పరిష్కారం పొందాలని సూచించారు. కార్యక్రమాన్ని ఉదయం 11:30 నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. వేదిక చైర్‌పర్సన్, విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులు పాల్గొంటారని వెల్లడించారు.

నిబంధనలకు విరుద్ధంగా టెండర్లు



ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో అర్జీలు ఇస్తున్న ప్రజలు

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ విభాగంలో తాత్కాలిక సిబ్బంది నియామకం కోసం రాధమ్మ అనే మహిళ నిబంధనలకు విరుద్ధంగా టెండర్లు వేశారు. సహకరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకొని టెండర్ రద్దు చేయాలని భారతీయ జనతా పార్టీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు టీ.శ్రీను ఫిర్యాదు చేశారు. సోమవారం స్థానిక నగరపాలక కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. కమిషనర్ ఎస్.రవీంద్రబాబు పాల్గొని ప్రజల వినతులు స్వీకరించారు. ప్రజలు ఇచ్చిన 17 ఫిర్యాదుల పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. నగరపాలక అదనపు కమిషనర్ కృష్ణ, మేనేజర్ చిన్నరాముడు, ఎస్ఈ. రాజశేఖర్, ప్రజారోగ్య శాఖాధికారి విశ్వేశ్వర రెడ్డి, సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్, ఎంఈ సత్యనారాయణ పాల్గొన్నారు.

ఫిర్యాదుల్లో కొన్ని..

- నగర శివారులోని రాజీవ్ గృహకల్ప సముదాయంలోని 3వ బ్లాక్‌లో కొత్తబోరు వేయించాలని కాలనీవాసులు లక్ష్మీరెడ్డి, వెంకటరాముడు, సంజీవ్ రెడ్డి ఫిర్యాదు చేశారు,
- రహదారులు, మురుగునీటి కాల్వలు నిర్మించాలని ఎఫ్.సి.ఐ కాలనీకి చెందిన ప్రకాష్, విజయ భాస్కర్, భూపాల్ రెడ్డి వినతిపత్రం ఇచ్చారు.
- బాలాజీ నగర్‌లోని క్రీసెంట్ హైట్స్ అపార్టు మెంటు వద్ద పూడికతీత పనులు చేపట్టాలని స్థానికులు హుస్సేన్, లక్ష్మణ్‌స్వామి, చంద్రశేఖర్ విన్నవించారు.
- అశోక్‌నగర్, భగత్ సింగ్ నగర్ వైపు నుంచి వచ్చే మురుగు నీరును కేసీ కెనాల్‌లోకి వెళ్లకుండా 8 నెలల క్రితం నిలిపేశారు. అయితే ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు కాలనీవాసులు ప్రభాకర్, బసన్న ఫిర్యాదు చేశారు.

సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి



మాట్లాడుతున్న కె.సుధాకరప్ప

కర్నూలు(సెంట్రల్): కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని భవన నిర్మాణ కార్మిక సంఘం నగర అధ్యక్షుడు కె.సుధాకరప్ప డిమాండ్ చేశారు. సోమవారం సూర్యనారాయణ భవన్‌లో శరీన్ నగర్ మట్టి అడ్డా కార్మికుల సమావేశాన్ని వెంకట్రాముడు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భవన నిర్మాణ కార్మికుల ఓట్లతో గద్దె నెక్కిన కూటమి ప్రభుత్వం వారికి ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదన్నారు. వెంటనే సంక్షేమ బోర్డును పునరుద్ధరించి, తద్వారా సంక్షేమ ఫలాలు అందించాలని డిమాండ్ చేశారు. మధ్య తరగతి వర్గాలపై కరెంట్ బిల్లుల భారం తీవ్రంగా పడిందని, ఒకేసారి రూ.20 వేల కోట్ల భారం మోపడం అన్యాయమన్నారు. స్మార్ట్ మీటర్ల పేరుతో ప్రజలను మోసం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నాయకులు శ్రీనివాసులు, వెంకటరాముడు, వేణు, దాసు, ఎంజే ఈశ్వరయ్య, రమాదేవి, మరియమ్మ, ఎల్లమ్మ, లక్ష్మీ, సరోజమ్మ తదితరులు పాల్గొన్నారు.

టీడీఆర్ బాండ్ల జారీపై విజిలెన్స్ ఫోకస్

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థలో జారీ అయిన టీడీఆర్ (ట్రాన్స్ఫరబుల్ డెవలప్‌మెంటు రైట్) బాండ్ల అవకతవకలపై విజిలెన్స్ ఫోకస్ పెట్టింది. అప్పట్లో టీడీఆర్ బాండ్ల జారీ సమయంలో పనిచేసిన నగరపాలక సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్‌ను వివరణ కోరింది. ఈ మేరకు సోమవారం విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంటు ప్రాంతీయ సంచాలకులు చౌడేశ్వరీ వివరాలు కోరుతూ లేఖ రాశారు. అందులో.. గోరంట్ల రమణశెట్టి కల్లూరులోని సర్వే నంబర్ 421/1 టీడీఆర్ నంబర్ (1016/00015/టీడీఆర్/కర్నూలు), షేక్ రసూల్‌కు చెందిన సర్వే నంబర్ 134, 158లో టీడీఆర్ నంబర్ (1016/00032/టీడీఆర్/ఆర్‌జీకే)తో పాటు కురువ మద్దిలేటి (సర్వే నంబర్ 719/బి)లో టీడీఆర్ నంబర్ (1016/00052/ డీఆర్) ఇలా... దాదాపు 33కు పైగా టీడీఆర్ బాండ్లు జారీ చేశారు. బాండ్ల జారీలో అనేక అక్రమాలు జరిగినట్లు విజిలెన్స్ అధికారులు గుర్తించారు. వ్యక్తిగతంగా రికార్డులు పరిశీలించారు. పూర్తి స్థాయిలో విచారణ చేశారు. నగర అభివృద్ధిలో భాగంగా నగరపాలక సంస్థ ఈ టీడీఆర్ బాండ్లను జారీ చేయాల్సి ఉంది. అయితే ఇక్కడే విజిలెన్స్ అధికారులు అనేక లోపాలు గుర్తించారు. వాస్తవానికి టీడీఆర్ బాండ్ల కోసం దరఖాస్తు చేసుకునే యజమాని తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ డిపార్టుమెంట్‌కు సంబంధించిన మార్కెట్ వాల్యు జత చేయాల్సి ఉంది. అనేక దరఖాస్తుల్లో మార్కెట్ వాల్యూలు లేవు, పైగా కొంత మంది అధికంగా మార్కెట్ వాల్యూను నమోదు చేసి ప్రభుత్వానికి గండి కొట్టే ప్రయత్నాలు చేశారు. వీటన్నింటిని పరిశీలించాల్సిన సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్ వాటిని విస్మరించినట్లు విజిలెన్స్ అధికారులు గుర్తించి వివరణ కోరారు. 5 రోజుల వ్యవధిలో పూర్తి స్థాయిలో విజిలెన్స్‌కు నివేదిక సమర్పించాలని ఆ లేఖలో కోరారు.